# ఆయుధం

నవల



నది మాసపత్రిక వచనకావ్య రచనల పోటీలో
బహుమతి పొందిన నవల

టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి

**ఆయుధం (నవల)**
**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**

ప్రథమ ముద్రణ : **జూలై, 2016**
ప్రతులు : **1000**
హక్కులు : © రచయితవి

కళాప్రచురణలు : 9
మదనపల్లె – 517 325
వెల : ₹ **180/-**

ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రములు
లేదా

**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
3-169-16 రామారావు కాలనీ
బాపూజీ మునిసిపల్ స్కూల్ ఏరియా
**మదనపల్లె – 517 325**
చిత్తూరు జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 08571 – 221963
సెల్ : 93472 98942
email : todimellakrishnamurthy@gmail.com

ముఖచిత్రం : **ఎస్. శ్రీకాంత్, మదనపల్లె**
సెల్ : 98853 43915

ముద్రణ : **విజయవాణి ప్రింటర్స్**
గోసులకురప్పల్లి రోడ్డు
చౌడేపల్లి – 517 257
చిత్తూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్.

# ఆయుధం

**“వే**దాలనూ, ఉపనిషత్తులనూ అధ్యయనం చేసి ఆకలింపు చేసుకోవడానికి ప్రయత్నించి కొంతమేర కృతకృత్యుడనయ్యాను!.. కానీ.. మనసులోని మృత్యు భయాన్ని తొలగించుకోలేక పోతున్నాను!!

అసలి యుగాలు, యుగధర్మాలు ఎందుకు మారుతూ రావాలి? కలిపురుషుని రాకతో సృష్టిలో ఇన్ని వైపరీత్యాలు సంభవించి మానవులు ఎందుకు అల్పాయుష్కులు కావాలి??

అసలు మనిషి ఎందుకు పుడ్తాడు?
ఎందుకు పెరుగుతాడు?
ఎందుకు మరణిస్తాడు?

ఇవీ నన్ను సదా వేధించే ప్రశ్నలు!” అన్నాడు చిన్ననాయుడు.......

ఆయన మనసులోని భయాన్ని చూసి నేను లోలోపలే నవ్వుకున్నాను.

“మనుషులు అల్పాయుష్కులైనంత మాత్రాన వచ్చే నష్టం ఏముంది? ఎంత కాలం జీవించినా మనిషికి మరణం తప్పదు కదా? పోనీ ఇది చెప్పండి.. మీరు ఎంతకాలం బ్రతకాలని భావిస్తున్నారు?”... మనసులో పరిహాసంగా నవ్వుకుంటూనే ప్రశ్నించాను.

“షష్ఠిపూర్తి, భీమరథి, సహస్ర చంద్ర దర్శనం... ఈ మూడింటినీ జరుపుకునే వరకూ జీవించాలనే ఆశ నాకూ ఉంది మిత్రమా! కానీ అది సాధ్యమా?”

ఆయన స్వరంలో కొద్దిపాటి విషాదం... అయితే దాన్ని పెద్దగా పట్టించు కోలేదు నేను.

ఎందుకంటే.........

-2-

ఆముదపు చెట్టుపై ఆకుమీద నిలచిన మంచు నీరెండకు కరిగి నీటి బిందువుగా మారి, జారి ఠప్ మని రాజయ్య తలమీద పడింది.

అంతవరకూ ధ్యాన ముద్రలో ఉండిపోయిన అతడు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

లేత ఎరుపు, తెల్లని తెలుపు కాంతుల మధ్యన ఉదయభానుడు తూర్పు కొండల వెనుక నుండీ పైకెగబద్తుండడం కనిపించింది మొదట.

మంచు తెరలు తెరలుగా విడిపోతూ ఆవిరిగా మారి గాలిలో కలసిపోతోంది.

తను కూర్చున్న రాతి అరుగు దగ్గర్నుండీ అవతలివైపు కొంత దూరంలో కన్పిస్తున్న కానుగచెట్ల వరకూ వున్న నాలుగెకరాల తడిపొలం అతనిదే.

దాన్ని సంపాదించుకోవడం కోసం అతడు తన తండ్రితో కలసి అనేక సంవత్సరాలపాటు రాత్రింబవళ్ళు నిర్విరామంగా కృషి చేశాడు.

తమ రక్తాలను చమటలుగా మార్చి ధారపోస్తూ కొండలలోని పెద్ద పెద్ద బండలనూ, గుండ్లనూ చీల్చి ముక్కచెక్కలు చేస్తూ గడిపారు వారు. వాటిలోంచీ గృహ నిర్మాణాలకు కావాల్సిన రాళ్ళూ, బండలూ, కంకరా మొదలైనవి తయారు చేస్తూ ఎండా, వానా, చలి, గాలి అని అనుకోకుండా అహోరాత్రులు కష్టపడ్డారు.

కష్టపడి సంపాదించుకున్న దానిని చూసుకోవడంలో గొప్ప తృప్తీ, అంతులేని ఆనందమూ ఉందతనికి. అందుకే ప్రతిరోజూ తప్పనిసరిగా సూర్యోదయం కన్నా బాగా ముందుగానే వచ్చి ఆ రాతిబండ మీద కూర్చుని తన పొలాన్ని చూసుకుని ఆనందించడం.. ఇతర రైతులెవరూ రాకుండా ఏకాంతం లభించినప్పుడు ఏకాగ్రత కుదిరితే అక్కడే కాస్సేపు ధ్యానం చేసుకుంటూ గడపడం అతనికి అలవాటే. ఆ సంతృప్తి అనిర్వచనీయంగా ఉంటుందతనికి.

తలమీద పడ్డ నీటిచుక్కను విదిలించే ప్రయత్నంలో చేయి తలమీదకు వెళ్ళగానే తలమొత్తం చల్లగా తగిలింది మంచుతో నానడం వల్ల. నవ్వుకుంటూ బండమీద నుండీ కాళ్ళు క్రిందికి దించి చెప్పులు తొడుక్కుని లేచి బయల్దేరాడు రాజయ్య.

దారిలో దయ్యాలబావి గట్టుమీదున్న మర్రిచెట్టు ఊడలలోంచి ఓ ఊడకొన తుంచుకుని పండ్లు తోముకుంటూ కొంత దూరంలోవున్న తమ చేనుకేసి అడుగులు వేశాడు.

చేను గట్టుమీద కాస్సేపు నిలబడి పూతకొచ్చిన వేరుశెనగ చెట్లనూ, కాపుకు రాబోతున్న కందిచెట్లనూ కళ్ళారా చూసుకుని వెనుదిరిగాడు.

చిన్నరెడ్డి బోరు క్రింద సన్న కాలువలో ముఖం కడుక్కుని అతడు ఊర్లోకి ప్రవేశించే సమయానికి రచ్చబండమీద నలుగురు కుర్రవాళ్ళు నీరెండలో కూర్చుని ఏదో చెప్పుకుని సరదాగా నవ్వుకుంటున్నారు.

"మా చిన్నతనంలో ఇలా ఎప్పుడూ సమయం ఉృథా చేసేవాళ్ళం కాము!" అని అనుకున్నాడు రాజయ్య వాళ్ళనే గమనిస్తూ.

"కృషితో నాస్తి దుర్భిక్ష్యం" అన్నది అతని తరంవాళ్ళ సిద్ధాంతం. అందువల్ల కర్తవ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడేది ఆ రోజులలో! పని సంస్కృతిలో ప్రతి నిముషం విలువైనదిగా భావింపబడ్తుండేది. అందువల్ల కుర్రకారెవరూ అనవసరంగా బలాదూరు తిరగడంకానీ, పని లేకుండా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ గడపడం కానీ చేసేవారు కాదు.

అది గతం!.... ప్రస్తుతం కాలం మనుషులను మారుస్తోంది!!

బాగా పెద్దవాళ్ళ చర్చలకే పరిమితమయివుండిన రాగి, వేపమాన్ల క్రింది రచ్చబండ ప్రస్తుతం కుర్రకారు తాలూకు కులాసా కబుర్లకు కూడా నిలయంగా మారుతోంది. పెద్దవీధి చివర్న బండిబాటకు దగ్గరగా పగులు పచ్చారు చెట్టుక్రింద వెలసిన టీ దుకాణం దగ్గర కూడా పిల్లవాళ్ళ కలయికలు ఎక్కువవుతున్నాయి.

చదువుకోవడమో, కష్టపడి సేద్యపు పనులు చెయ్యడమో కాకుండా ఎక్కువ మంది పిల్లలు పెందలాడే లేచి పాలెం కొండకో, కంభంకోటకో బయల్దేరిపోయి అక్కడి పశువుల అమ్మకాలలో, మండీలలో, రిజిస్ట్రేషను ఆఫీసు దగ్గరా దళాలి పనులు చేసి, సునాయాసంగా డబ్బు సంపాదించే మార్గాలను వెతుక్కుంటున్నారు తప్ప అందులోని మంచి చెడ్డలను బేరీజు వేసుకోవడం లేదు.

పాలెంకొండ సినీమా కొట్టాయంలో కొత్త సినీమా విడుదలవుతుందంటే చాలు తెల్లవారకముందే చీకటిలో, చలిలో బయల్దేరి వెళ్ళి, డబ్బాలు వచ్చేవరకూ కొటాయి ముందరి రోడ్డుమీద జనంలో పడిగాపులుపడి గుంపులో, తోపులాటలో అవస్థలుపడి టిక్కెట్టుకొని... దొరకకపోతే... అట్నించి అటే కంభంకోట బస్సెక్కి వెళ్ళి అక్కడయినా ఆ సినీమా చూసి, తరించి వెనుతిరిగి వచ్చే సినీమా పిచ్చోళ్ళూ తయారయిపోయారు ఊర్లోని కుర్రకారు మధ్యన.

ఇక క్రికెట్ ఆటలు ప్రసారం అయ్యే రోజులలో టీవీల చుట్టూ మూగిపోయి శాపగ్రస్తుల్లా గంటల తరబడి గడిపి వెయ్యడం....

మేమేం తీసిపోయామా? అన్నట్లు అనేక టీవీ సీరియల్లకు అంకితం అయిపోతున్న ఆడపిల్లలు..

పై కారణాల వల్ల గ్రామంలో పని సంస్కృతి వెనుకడుగు వేస్తోంది.

ఆ విషయాలన్నీ ఆలోచిస్తూ రాజయ్య రచ్చబండను దాటి కాస్త ముందుకు వెళ్ళగానే రచ్చబండ మీద నుండీ ఓ కుర్రాడు..

"పి.పి. ఎయిటీన్ డౌన్!" అన్నాడు పరిహాసంగా.

మిగిలిన కుర్రాళ్ళు బిగ్గరగా నవ్వడమేకాదు, చప్పట్లు కూడా కొట్టారు లయబద్ధంగా.

రాజయ్య కాస్త ఆగి వెనక్కి తిరిగి వాళ్ళకేసి నవ్వుతూ చూశాడు. తరువాత ఉత్తరంవైపు తిరిగి దూరంగా కన్పిస్తున్న కొండలకేసి చూశాడు తదేకంగా.

ఆపై మళ్ళీ కుర్రవాళ్ళకేసి సూటిగా చూస్తూ "మీకీ స్వేచ్ఛా, సుఖాలు ఏర్పడడం కోసం ఈ గ్రామంలో ఎందరు పిరికివాళ్ళు ఎంత రక్తం ధారపోశారో, గతంలో ఎన్ని బలిదానాలు జరిగాయో మీకెలా తెలుస్తుంది?" అని అనుకున్నాడు మనసులో.

మరు నిముషం చప్పున అటు తిరిగి తన దారిన తను నడవడం మొదలు పెట్టాడు మళ్ళీ.

"పి.పి. ఎయిటీన్ అని మనం ఎన్నిసార్లు ఎద్దేవా చేసినా ఆయన కొంచమయినా కోపగించుకోకుండా నవ్వేసి మరీ వెళ్ళిపోతాడేమిట్రా?" అన్నాడు ఓ కుర్రాడు.

"నవ్వి వెళ్ళిపోతూ ఆ ఉత్తరపు కొండకేసి కూడా చూసి నవ్వుతాడ్రా ఆయన!" అన్నాడు ఇంకో కుర్రాడు.

"కాస్త పిచ్చా?"

"పిచ్చికాదు కానీ ఆయనదదో లోకం! మన వయసులో ఉండగా ఆయన మహాబలశాలి, ధైర్యవంతుడూ అని మా జేజి, తాతా చెప్తుంటారు. ఆ తరువాతే ఆయన పిరికివాడయి పోయాడంటుంది మా అవ్వ. ఊర్లో స్కూలు యేర్పడే వరకూ ఆ రోజులలో రాత్రి బడి నడిపేవాడట. ఈయనవల్ల మన ఊరికెంతో మేలు జరిగిందని మా నాయన అంటుంటాడు!" అన్నాడు చివరి కుర్రాడు రాజయ్య వెళ్ళిన వైపే చూస్తూ.

* * * * *

రాజయ్య ఇల్లు చేరే సమయానికి తలస్నానం చేసి సగం నెరిసిన కురులను జారుముడి వేసుకుని పచ్చని పసుపు చీర కట్టుకున్న అతని భార్య భాగ్యలక్ష్మి పెద్ద ముత్తయిదువులా ఇంటిముందు ముగ్గులు తీర్చుతోంది.

ఆ దృశ్యం అతనికి మనోహరంగా అన్పిస్తుంది ఎప్పుడు చూసినా. అయితే సుందరమైన ఆ దృశ్యాన్ని చూస్తూ ఓ నిముషమైనా నిలబడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయాడు. పెరట్లోని నీళ్ళ కాగు వద్దకు వెళ్ళి మళ్ళీ ముఖం కడుక్కుని ఆపై అక్కడే స్నానం చెయ్యడం మొదలుపెట్టాడు.

రాజయ్య స్నానం ముగించేలోగా అతని కుమారుడు గోపీకృష్ణ తెల్లగా ఉతికి చలువ చెయ్యబడ్డ పంచ, తువ్వాలు తెచ్చి అడ్డుగోడమీద ఉంచి వెళ్ళాడు.

తువ్వాలుతో తలా, ఒళ్ళూ తుడుచుకుని, పంచె కట్టుకుని ఇంట్లోకి వచ్చిన రాజయ్య దేవుడి గదిలోకి వెళ్ళి ఐదారు నిముషాలపాటు కళ్ళు మూసుకుని ప్రార్థన చేసి హాల్లోకి వచ్చేసరికి భాగ్యలక్ష్మి కూడా కాళ్ళూ చేతులు కడుక్కుని హాల్లోకి వచ్చింది.

భార్యాభర్తలిరువురూ ఒకరి ముఖం మరొకరు చూసుకుంటూ అరనిముషం పాటు మౌనంగా ఉండిపోయారు.

ఒక్కో సందర్భంలో మౌనం చాల బావుంటుంది.

“ఏమిటి.. అంత దీర్ఘంగా ఆలోచిస్తూ అలా ఉన్నావు?” అని ప్రశ్నించింది ఆమె నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

“ఏం లేదు?”

“అయితే పద.. పలహారం చేసేద్దాం!”

“ఓ పది నిముషాలు పోనీ లక్ష్మి!” అంటూ అతడు పడక కుర్చీలో కూర్చున్నాడు.

“ఏదో జరిగింది.. లేకపోతే అంతగా ఆలోచిస్తూ ఇంత ముభావంగా ఉండవు!” అంది ఆమె అతని కాళ్ళ వద్ద నేలమీద కూర్చుంటూ.

అతడు జవాబు చెప్పలేదు.

“ఏం జరిగిందో చెప్తే కదా?” అంటూ ఆమె మరోసారి రెట్టించి అడగడంతో అతనికి చెప్పక తప్పలేదు.

"ఈ మధ్యన మన ఊరి పిల్లవాళ్ళు నన్ను పరిహసించడం ఎక్కువయిపోతోంది లక్ష్మీ! నిన్న సాయంత్రం రచ్చబండ మీద నేనొక్కడ్నే కూర్చుని వున్నాను. అప్పుడు అటుగా వెళ్తున్న కుర్రవాళ్ళలోంచి ఎవరో నన్ను చూసి "పి.పి. ఎయిటీన్ బ్లాక్" అన్నాడు.

తరచుగా అలా నెంబరు చెప్పి డౌన్, అప్, బ్లాక్ అంటూ హాస్యాలాడుతున్నారు. ఈ రోజు, ఇందాకా ఇంటికి వస్తున్నప్పుడు రచ్చబండమీద కూర్చున్న మరో గుంపులో ఒక అబ్బాయి అదేమాట అన్నాడు.. వాళ్ళు అన్నదాన్ని గూర్చి ఆలోచిస్తున్నాను.. అంతే!!"

తెల్లబోయింది ఆమె.

"ఇంతకూ పి.పి. ఎయిటీన్ అంటే ఏమిటి?" అని ప్రశ్నించింది ఆమె అర్థంకాక.

"అంటే పారిపోయిన పిరికివాడి సంఖ్య పద్దెనిమిది అని అర్థమట!" నెమ్మదిగా నవ్వేస్తూ చెప్పేశాడు రాజయ్య.

మొదట తనుకూడా నవ్వు ఆపుకోలేక నవ్వేసింది భాగ్యలక్ష్మి. కానీ ఆవెంటనే తన భర్త నంతమాట అన్నవాళ్ళ మీద కోపం తన్నుకు వచ్చిందామెకు.

"అలా అనేవాళ్ళ చెవులు మెలేసి కేకలెయ్యలేక పోయావా?" అంది ఉక్రోషంగా.

"పరాయి పిల్లల్ని యేమని మందలించను? అయినా స్వర్గాన ఉన్న ఆ చల్లని మారాజు ఏనాడో చెప్పారు. వారు చెప్పింది జరిగే చూచనలే కన్పిస్తున్నాయి!"

"ఎవరు? చిన్న నాయుడుగారా?"

"ఆ!"

"ఏం చెప్పారు?"

"చాల చెప్పారు.. కొన్ని జరిగాయి.. మరికొన్ని జరగబోయేలా వున్నాయి!"

"ఏం చెప్పారో, ఏంజరగబోతుందో చెప్పవచ్చు కదా?" అందామె ఆసక్తిగా.

కొన్ని నిముషాలపాటు ఆలోచనలలో పడిపోయాడు రాజయ్య. ఆ సమయంలో అతనికెన్నో విషయాలు స్ఫురణకు రాసాగాయి. చివరికి నెమ్మదిగా చెప్పడం మొదలు పెట్టాడు.

"లక్ష్మీ, ఆయనకు పేదవాళ్ళన్నా, బడుగువర్గాల ప్రజలన్నా ప్రాణం. కష్టంలో ఎవరున్నా.. ఆ కష్టం తనకే వచ్చినట్లుగా మధనపడిపోయే మంచి మనసున్న మారాజాయన.

దాదాపు ముప్ఫయి సంవత్సరాల క్రితం ఆయనన్న కొన్ని మాటలయితే ఇప్పటికీ స్పష్టంగా చెవుల్లో విన్పిస్తున్నట్లే ఉన్నాయి....... "రాజయ్యా! మనదేశం అయితే సర్వ స్వతంత్రమైంది కానీ ఈ దేశంలోని వేలవేల గ్రామాలు, లక్షలాది పల్లెటూర్లు ఇంకా కూడా స్వార్థపరులైన ధనవంతుల, భూస్వాముల అదుపాజ్ఞలలోనే ఉండిపోతున్నాయి. అందువల్ల వాస్తవానికి ఆయా ప్రాంతాల ప్రజలకు పూర్తి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభ్యం కావడం లేదు. కోట్లాది మంది అమాయకపు ప్రజలు కట్టు బానిసలలాగా నికృష్టమైన జీవితాలు గడుపుతున్నారు.

వాస్తవికమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను వారందరూ కూడా అనుభవించగలిగేలా గ్రామీణ జీవన వ్యవస్థలో పెనుమార్పులు రావాలి. స్వార్థపరుల అజమాయిషీ నుండీ అమాయకులైన, అసహాయులైన ప్రజలకు విముక్తి లభించాలి. ప్రతి మనిషీ తల ఎత్తుకు జీవించగలగాలి.

వృక్షసంపద, భూసంపద, నీరు అందరికీ సమానంగా అందుబాటులోకి రావాలి. అప్పుడే గ్రామసీమల, పల్లెటూర్ల సమగ్రాభివృద్ధికి అవకాశాలు లభించగలిగేది.

అయితే.......

ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయాలు కూడా కొన్ని వున్నాయి. వ్యక్తులకు లభ్యమయ్యే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వారి వ్యక్తిత్వ వికాసాలకు, వారి వారి ఆర్థికాభివృద్ధులకు దోహదపడాలి తప్ప వారిని... ముఖ్యంగా యువతరాన్ని తప్పుదోవ పట్టించకుండా కాపాడగలిగే ఓ బలీయమైన కట్టుబాటు కూడా ఏదయినా తప్పక యేర్పడాలి.

అలా కాకపోతే మనుష్యులు సోమరిపోతులుగా తయారు కావడం, ఏమాత్రం కష్టపడకుండా సుఖంగా, ఘనంగా కాలం గడపాలనుకునే స్థితికి చేరుకోవడం, గ్రూపులు కట్టే సంస్కృతికి, అనవసర రాజకీయాలకూ, తగాదాలకూ అలవాటు పడడం లాంటి విష పరిణామాలు చోటు చేసుకుని యువతరం మీద కూడా బలీయమైన ప్రభావాన్ని చూపుతాయి. అప్పుడు పిచ్చివాని చేతిలో రాయిలా తయారయిపోతుంది వారికి లభించిన స్వేచ్ఛ!

దాని ఫలితం చాల చాల దూరం విస్తరించే అవకాశం ఉంది.

ముందు ముందు పొలాలలో పని చెయ్యడానికి మనుషుల కొరత ఏర్పడడం, కొంతమేర భూమి పంటలు పెట్టబడకుండా, బీడుపడడం, ధాన్యోత్పత్తి తగ్గిపోవడం జరగవచ్చు. కులవృత్తుల మీద కూడా ప్రభావం పడ్తుంది తప్పకుండా. వృత్తులు మరుగున పడి వలసలు పెరగవచ్చు.

ఇలాంటి ప్రమాదాలకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత, గ్రామ సీమలను సంరక్షించుకుని సుభిక్షంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఖచ్చితంగా ప్రతి మనిషి మీదా ఉండి తీరాలి!" అన్నారు.

"ఆయన చెప్పిన విషయాలను మననం చేసుకుంటూంటే ఇప్పుడు కాస్త భయం కూడా కలుగుతోంది. ఎందుకంటే ప్రస్తుతం మనకెంతో స్వేచ్ఛవుంది. తలఎత్తుకు తిరిగే ఉన్నత స్థితివుంది.. అయితే.. మనుషుల ఆలోచనలలో.. ముఖ్యంగా.. కుర్రవాళ్ళ ఆలోచనా విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఏమంత హర్షించదగ్గవిగా కన్పించడం లేదు!"

ఈ చివరి మాటలంటున్నప్పుడు అతని స్వరంలో చాల బాధ ధ్వనించింది.

"పనులు నెత్తిన పడే కాలం కాదు కదా.. అందువల్ల పిల్లవాళ్ళు కాస్త సరదాగా తిరుగుతున్నారేమో?" అందామె సాలోచనగా.

"అయివుండవచ్చు!" అన్నాడు అతడు అర్ధాంగీకారంగా.

"అయినా నాకు తెలియకడుగుతాను. నీవూ కొన్నేండ్లపాటు పారిపోయి వుండిన పిరికి వాడివేకదా?" అంది భాగ్యలక్ష్మి నవ్వేస్తూ.

రాజయ్య ఒక నిట్టూర్పు వదిలాడు.

"నిజమే లక్ష్మీ! నేనూ పారిపోయిన మాట నిజమే!! అంతమాత్రానా నేను పిరికివాడ్ని మాత్రం కానుకదా? అది నిజం! ఈ మాటయినా నీతో మాత్రమే అంటున్నాను! "నేను పిరికివాడిని కాను" అని నిరూపించుకోవాల్సిన అవసరం నాకయితే లేదు కదా?"

ఆమె వింతగా చూసింది అతని వైపు.

"మరలాంటప్పుడు నా ఆలోచనయేమిటంటావా? మన చిన్న తనపు రోజులలో

మనం ఎప్పుడూ, ఎందుకూ ఎవరినీ ఇలా పరిహసించే వాళ్ళము కాముకదా? కానీ ఈ తరంలో మన ఊరి పిల్లలు ఇతరులలోని లోపాలను వెతకడమే తమ పరమావధిగా భావిస్తున్నారు. అదేమంత మంచి విషయం కాదు. ఇలాంటి అలవాట్లే క్రమంగా మనుష్యులను కు సంస్కారులుగా మార్చుతాయి!”

తన భర్త మాటలు వింటూ కూర్చున్న ఆమెకు హఠాత్తుగా గతంలో.. చాల సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటన కళ్ళముందు మెదిలింది.

.......... ఓ అందమైన యువతిని కబళించడానికి ముగ్గురు రాక్షసులలాంటి మనుష్యులు మూడువైపుల్నుండీ చుట్టుముద్తున్నారు. ఆ యువతి భయంతో వణికిపోతోంది, కన్నీరు కారుస్తోంది దీనంగా నిలబడిపోయి.

అంతలో బలిష్టమైన కండలతో దేవుడు పంపిన దూతలా ఓ యువకుడు మెరుపులా ఆ ప్రదేశానికి చేరుకున్నాడు. ఉగ్రనరసింహమూర్తిలా అతడు యేదో అంటున్నాడు.. అతని కుడి చేతిలోంచీ రక్తం కారుతోంది.. అదే రక్తం అతని ముఖం మీద కూడా భయానకంగా కన్పిస్తోంది.. రాక్షసులలాంటి ఆ వ్యక్తులు ముగ్గురూ వణికిపోతూ..................

“లక్ష్మీ!”

భర్త పిలుపుతో ఉలికిపడి జ్ఞాపకాల మధ్య నుండీ వెలుపలపడి ఈ లోకంలోకి వచ్చింది ఆమె.

“నీవు పిరికివాడివి కావు!” స్థిరంగా అంటూ భర్తవైపు ప్రేమగా చూసింది ఆమె.

అదే సమయంలో ఎందుకో అప్రయత్నంగా ఆమె కళ్ళలో తడి కదిలింది.

కొన్ని అనుభూతులకు కారణాలు కన్పించవు.

“మమ్మీ, టైమైపోతోంది!” అంటూ కుమార్తె హిమబిందు వచ్చేసరికి ఆ అనుభూతి లోంచీ చప్పున వెలుపలపడింది భాగ్యలక్ష్మి.

పాతికేళ్ళ వయస్సొచ్చేస్తున్నా ప్రతి చిన్న పనికీ తల్లిమీదే ఆధారపడ్తుంది హిమబిందు. హిమబిందుకు టిఫన్ పెట్టడం కోసం వంటగదికేసి నడచింది భాగ్యలక్ష్మి.

❊ ❊ ❊ ❊ ❊

లోకసాక్షి విశ్రాంతి కోసం పడమటి కొండల చాటుకి జారుకుంటున్న గోధూళి వేళ..........

ఎత్తయిన తమ మేడమీది వరండాలో నిలబడి ఎదురుగా కన్పిస్తున్న దృశ్యాలను చూస్తున్నాడు రాజయ్య.

ఆ మేడ నిర్మాణానికి ఉపయోగించిన ప్రతి రాతిముక్కా అతడూ, అతని తండ్రీ కలసి కొండలోని గుండ్లనూ, బండలనూ బ్రద్దలుకొట్టి తమ స్వహస్థాలతో తయారు చేసుకున్నవే.

అక్కడి నుండీ చూస్తూంటే అతనికి ఎన్నో ప్రదేశాలు కన్పిస్తున్నాయి వరుసగా..... ఒక్కో ప్రదేశం ఒక్కో జ్ఞాపకాన్ని కదిలిస్తూ!! ఆ జ్ఞాపకాలలో కొన్నింటిని అతడు ఎప్పుడూ ఎవరికీ.. చివరికి తన భార్యాపిల్లలకు కూడా చెప్పుకోలేదు.

అతని తండ్రి కూడా తన చివరి దశకాలలో ప్రతి సాయంకాలం అక్కడే నిలబడి కన్పించినంతమేరా చూస్తూ కాస్సేపు గడిపేవాడు. ఉత్తర దిశలో తన భార్యను పాతిపెట్టిన ప్రదేశం వైపు ఆయన చూపులు అలా నిలచిపోయేవి ఒక్కోసారి. గతస్మృతులలోని కొన్ని ముఖ్య విషయాలు జ్ఞాపకానికి వచ్చేవేమో?.. అప్పుడప్పుడు కళ్ళనీళ్ళు తుడుచుకునే వాడాయన.

ఆయన కాలప్రవాహంలో కలసిపోయి కూడా చాల కాలమైపోయింది.

గతంలో.. సాయం సమయాలలో ఆయన నిలబడి తన పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్న ప్రదేశంలో తనూ నిలబడి ప్రకృతిని చూస్తూ ఆలోచిస్తే..

తనకెన్ని స్మృతులో?

మరెన్ని జ్ఞాపకాలో??

ప్రశాంతమైన వాతావరణంలో వింతగా, నిత్యనూతనంగా చుట్టూ కన్పిస్తున్న ప్రకృతి ప్రదేశాలను చూస్తూ నిలబడ్డ అతనికి ఆరోజెందుకో హఠాత్తుగా చాలకాలం క్రితం తను బస్తీలోని హాస్పటల్ నుండీ వెలుపలికి వచ్చిన రోజు జ్ఞాపకానికి వచ్చింది.

-3-

కర్రసాయంతో కుంటుకుంటూ మెయిన్ రోడ్డు మీదకు వచ్చిన రాజయ్య కాస్త ఆగి వెనక్కు తిరిగి చూశాడు.

తనకు కాస్త వెనుకవున్న ఇనుపగేటు గుండా పొగచూరిపోయిన తైలవర్ణ చిత్రంలా కన్పించింది.. తనకు అన్నిరోజులు ఆశ్రయం ఇచ్చిన ప్రభుత్వ వైద్యశాల భవంతి.

"దాదాపు వంద రోజులు!" అని అనుకున్నాడు అతడు తనలో తను.

పంతొమ్మిది వందలా అరవయి నాలుగో సంవత్సరం తొమ్మిదవ నెల చివరి రోజులలో ఆస్పత్రిలో చేర్చబడి పంతొమ్మిది వందలా అరవయి అయిదు ఆరంభంలోనే వెలుపలికి వస్తున్నాడు తను.

అతనికి ఆశ్చర్యం కలిగింది.

తను ఆకాశాన్నీ బయటి ప్రపంచాన్ని పరికించి చూడకుండా ఆ ఆస్పత్రిలో "సర్జికల్ వార్డు" అనబడే ఓ హాలులోని మంచాల మధ్యనున్న ఓ మంచంమీద ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తూ కొన్ని నెలలపాటు గడిపివేయగలిగాడు.

పగటిపూట నల్లులు మాత్రమే కరిచేవి. రాత్రులందు వాటికి దోమలు తోడయ్యేవి. అడపాదడపా చీమలు కూడా తమవంతు పనులు నిర్వహిస్తుండేవి.

తనలాగే మంచం దిగలేని రోగుల తాలూకు మంచాల మీదనుండీ అప్పుడప్పుడు వచ్చే దుర్గంధ పూరితమైన వాసనలను భరించడం ఒక్కోసారి కష్టంగా వుండేది.

నొప్పులను భరించలేక క్రొత్తరోగులు చేసే ఆక్రందనలు "నరకం అంటే ఇదే సుమా!" అని అన్పింపజేసేవి. వీటన్నింటి మధ్యనా విరిగిన కాలు, విరిగిన చేయి, తగిలిన గాయాలూ మరింత బాధిస్తుండేవి నొప్పులతో, సలుపులతో.

ఆస్పత్రిలో మంచంమీదే సుదీర్ఘంగా గడచిన రోజులలో మాత్రం అతనికి ఓ విషయం పదే పదే జ్ఞాపకానికి వస్తుండేది.

అది...........

తన చిన్న తనంలో తను తరచు జీరంగులను, మిడతలనూ బాల్యచాపల్యంతో పట్టుకుని వాటిని ఖాళీ అగ్గిపెట్టెలలోనూ, గాలికోసం రంధ్రాలు చేసిన అమృతాంజనం, సైబాల్ డబ్బాలలోనూ, సోపు పెట్టెలలోనూ బంధించి ఉంచడం..........

ఆస్పత్రి భవంతినే చూస్తున్న అతని కన్నులలో హఠాత్తుగా నీరు సుడులు తిరగబోయి ఆగిపోయాయి. మరుక్షణం విస్ఫులింగాలను రాలుస్తున్నట్లుగా అరుణవర్ణం దాల్చాయి.

"త్రిమూర్తులూ!" అనుకుంటూ పండ్లు పటపటా కొరికాడు.

ఆస్పత్రి మీదనుండీ తన చూపులు మరల్చుకుని అటువైపు తిరిగి మెయిన్ రోడ్డులో కుంటుకుంటూ అడుగులు వెయ్యసాగాడు కర్రసాయంతో.

* * * * *

బస్సు ఆగింది!.. కదిలి వెళ్ళిపోయింది!!.. ఆ మధ్య కాలమైన ఐదు నిముషాలలో బస్‌లోంచీ నెమ్మదిగా క్రిందికి దిగేశాడు రాజయ్య. బస్సు రేపుతూ వెళ్ళిన దుమ్ములో అతడు నిలబడిన ప్రదేశం నుండీ సరిగ్గా అరమైలు దూరంలో ఉంది పోలీసు అవుట్ పోస్టు.

ఎముకలు విరిగి ముక్కలయి అతుక్కున్న కాలుతో కుంటుకుంటూ కర్రసాయంతో ఎండలో నడవడం మొదలు పెట్టిన రాజయ్య ఆ అరమైలూ నడచి అవుట్‌పోస్టు చేరుకోవడానికి దాదాపు గంట సమయం పట్టింది.

"సారీ రాజయ్యా! నీవిచ్చిన రిపోర్టు మీద బాగా ఎంక్వయరీ చేశాము. నిన్ను గూండాలు కొట్టి చంపడానికి ప్రయత్నించిన రోజున నాయుడూ, రెడ్డీ, స్వామీ.. ముగ్గురూ ఊర్లోలేరు. ఆ రోజుకు రెండుమూడు రోజుల ముందునుండీ కూడా వాళ్ళు గుర్రప్పందాల నిమిత్తం బెంగుళూరులో ఉన్నట్లుగా సాక్షాధారాలున్నాయి.

నిన్ను చంపాలని ప్రయత్నించిన వాళ్ళు ఎవరో యేగూండా నెట్‌వర్కుకు చెందిన యేప్రాంతపు మనుషులో కూడా అంతు చిక్కడంలేదు. అందువల్ల ఇప్పటికి మేమేమీ చెయ్యలేకపోతున్నాము.. వెరీ సారీ!"

అన్నాడు సబ్ ఇన్స్‌పెక్టరు వర్మ.

రెండు నిముషాలు మౌనంగా ఉండిపోయాడు రాజయ్య. తరువాత నెమ్మదిగా ప్రశ్నించాడు.. "సార్, వారి అరాచకాలకు మా ఊరి ప్రజలు ఇలా బలిపశువులుగా బలయిపోతూ ఉండాల్సిందేనా?"

వెంటనే జవాబు చెప్పలేదు వర్మ.

అతడు మిలటరీ సర్వీసు నుండీ డిశ్చార్జి అయి ఆపై పోలీసు సర్వీసులోకి వచ్చినవాడు. మంచి ఆలోచనా, అవగాహన కలిగి వున్నవాడు.

అందుకే తనలో తను తర్జన భర్జన పడ్డాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Ayudham**

* * *